సిర్పూర్(యూ) @ 9.4 డిగ్రీలు

తిర్యాణి: ఏజెన్సీ మండలమైన సిర్పూర్(యూ)లో ఆదివారం రాష్ట్రంలోనే అత్యల్పంగా 9.4 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే కెరమెరిలో 11.9, వాంకిడి 12.0, తిర్యాణి 12.5, ఆసిఫాబాద్ 12.6, జైనూర్, చింతలమానెపల్లి 13.1, కాగజ్‌నగర్ 13.3, సిర్పూర్(టి) 13.4, రెబ్బెన 13.5, కౌటాల, లింగాపూర్‌లో 14.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



లింగాపూర్‌లో చలిమంట కాగుతున్న ప్రజలు

కంకలమ్మా.. కరుణించమ్మా



ఆలయంలో కంకలమ్మ అమ్మవారు

- కౌటాల సమీపంలోని గుట్టపై స్వయంభూగా వెలిసిన అమ్మవారు
- ఈ నెల 27 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- కార్తిక మాసం చివరి ఆదివారం మహా జాతర
- ప్రత్యేక పూజలతోపాటు ఒగ్గుడోలు కళా ప్రదర్శనలు
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



కౌటాల మండల కేంద్రంలోని కంకలమ్మ గుట్ట

కౌటాల/చింతలమానెపల్లి: పచ్చని ప్రకృతి అందాలతో కనువిందు చేసే కౌటాల సమీపంలోని గుట్టపై రెండు రోజుల్లో సందడి మొదలుకానుంది. శివసత్తుల నాట్యం.. పోతురాజుల విన్యాసం.. మొక్కులకు నెలవుగా నిలిచే కంకలమ్మ జాతర ఉత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వసతులు కల్పించారు.

మేదరి కులస్తుల కుల దైవమైన కంకలమ్మ- కేతేశ్వరులను స్థానికులు గ్రామదేవతలుగా కొలుస్తుంటారు. కంకలమ్మ- కేతేశ్వరులు స్వయంభూగా వెలిసినట్లుగా చెబుతుంటారు. కౌటాల మండల కేంద్రం సమీపంలోని గుట్టలపై గతంలో విస్తారంగా వెదురు చెట్లు ఉండేవి. కులవృత్తిలో భాగంగా మేదరి కులస్తులు అడవిలో వెదురు సేకరణకు వచ్చి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వెదురు చెట్లు అధికంగా ఉండటంతో గుట్టకు కంకలమ్మ గుట్టగా పేరొచ్చింది. వెదురు సేకరణకు వచ్చిన స్థానికులు వేసవిలో దాహంతో అల్లాడుతుండగా.. కేతేశ్వరుడు (శివుడు) సామాన్య మేదరి కులస్తుడిగా తాగునీటితో అమ్మవారి ఆలయం ఉన్న ప్రాంతానికి వచ్చి వారి దాహం తీర్చాడు. కేతేశ్వరుని స్వరూపంగా తెలుసుకోలేకపోయిన వారు తమ దాహాన్ని తీర్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. రోజూ నీళ్లు ఇచ్చేందుకు రావాలని కోరారు. కొద్దికాలం తర్వాత కొందరు ముష్కరులు అమ్మవారి విగ్రహాన్ని దొంగలించి వెళ్తుండగా కాపలాగా ఉన్న కేతేశ్వరుడు అడ్డుపడ్డాడు. ముష్కరులు కేతేశ్వరుని తలను నరకడంతో శిలగా మారిపోయాడు. దొంగలించిన అమ్మవారి విగ్రహం ముష్కరులు తరలిస్తుండగా బెజ్జూర్ మండలం రుద్రాపూర్ వద్ద అంతర్ధానమైంది. అమ్మవారు సూక్ష్మరూపంలో కంకలమ్మగా గుట్టపైనుంచి మహిమలు చాటుతుందని స్థానికులు విశ్వసిస్తున్నారు.

చారిత్రక నేపథ్యం

కంకలమ్మ ఆలయం కాకతీయుల కాలంలో 11వ శతాబ్దంలో రెండో ప్రతాపరుద్రుని సమయంలో నిర్మించినట్లు ఆధారాలను బట్టి తెలుస్తోంది. 11వ శతాబ్దంలో కర్ణాటకలోని బీజాపూర్ జిల్లాలోని కల్యాణ కటకంలో కేతేశ్వరుడు అనే శివభక్తుడు ఉండేవాడు. ఆయన తపస్సుకు మెచ్చిన శివుడు కేతేశ్వరుని పేరుతో వెలుస్తానని అభయమిచ్చాడు. కేతేశ్వరుడికి ఇచ్చిన వరం అనుసరించి కౌటాలలో కేతేశ్వరుడు వెలిసాడని ఇక్కడి భక్తులు విశ్వసిస్తున్నారు. మరో కథనం ప్రకారం.. ఇక్కడ ఉన్న దేవుడిని ఆరాధించేందుకు రాక్షసులు గుడిని నిర్మించారని, ఒకే రాత్రిలో పూర్తి చేయకపోవడంతో ఆలయం అసంపూర్తిగా వదిలేశారని విశ్వాసం. దక్షిణ భారతదేశంలోనే కేతేశ్వరుడి పేరిట వెలసిన ఏకైక క్షేత్రం కౌటాల అని స్థానికులు నమ్ముతారు. కేతేశ్వరుని పేరు మీదుగానే కేతేశ్వరంగా కౌటాల ఏర్పడిందని భావిస్తుంటారు. కంకలమ్మ గుట్టకు ఇరువైపులా కనికి, కౌటాల గ్రామాలు ఉన్నాయి. కంకలమ్మ అమ్మవారికి గుర్తుగా కనికి, కేతేశ్వరునికి గుర్తుగా కౌటాల ప్రాంతాలు ఉన్నాయని విశ్వసిస్తున్నారు.

భక్తుల కొంగుబంగారం

కౌటాలలో వెలసిన కంకలమ్మ- కేతేశ్వరులు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. కౌటాల, బెజ్జూర్, సిర్పూర్(టి) మండలాల్లో కరువు, కాటకాలు సంభవించిన కాలంలో భక్తులు వచ్చి పూజలు చేసేవారు. కాలక్రమంలో క్షేత్రం శిథిలం కాగా ఏడాది క్రితం భక్తులు విరాళాలతో పునర్నిర్మించారు. జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తుంటారు. లేత బొంగులు వచ్చే ఈ కాలంలో మేదరి కులస్తులు ప్రత్యేక పూజలు చేస్తారు.

ప్రత్యేక కార్యక్రమాలు

- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27న బుధవారం ఆలయ వార్షికోత్సవం నిర్వహించి ఉత్సవాలు ప్రారంభిస్తారు.
- 28న క్షేత్రాధి దేవతల ప్రత్యేక పూజలు, ఉదయం 10 గంటలకు దేవస్థాన కాలసూచి ఆవిష్కరణ, 12 గంటల నుంచి మహాప్రసాద వితరణ, కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 29న ఉదయం 10.30 గంటలకు అమ్మవారికి శ్రీచక్రనవ వర్ణ కుంకుమార్చన, మహామంగళ హారతి, మంత్ర పుష్పం.
- 30న ఉదయం 9గంటల నుంచి అర్చకబృందం ఆధ్వర్యంలో కంకలమ్మ దేవి మహాయజ్ఞం, కూష్మాండ బలిహరణము, కళాన్యాసము, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మహాపూర్ణాహుతి, అవబృధ స్నానము, మహదాశీర్వచనం, మహాత్ముల ఆశీర్వాద భాషనం, గిరి ప్రదక్షిణ, విజయ ఘోష.
- డిసెంబర్ 1న అమావాస్య రోజు క్షేత్రాధి దేవతలు శ్రీస్వయంభూ కేతేశ్వర కంకలమ్మ దేవి అమ్మవార్లకు శతఛిద్ర మహాభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజ, భక్తులకు మూల విరాట్ సందర్శనం, జాతర మహోత్సవం.
- 2న అభిషేకం, అర్చనలు, జాతర మహోత్సవం.
- 3న ఉదయం 5.30గంటలకు దేవతలకు అభిషేకాలు, షోడశోపచారాం.



భక్తులు కొలుచుకునే కేతేశ్వరుడు

భక్తులకు సదుపాయాలు

భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తాగునీటి, వైద్య, ఇతర సదుపాయాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులు ఆలయ కమిటీ, అధికారులకు సహకరించాలి. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు నిబంధనలు పాటించాలి.

– సులువ కనకయ్య, ఆలయ వ్యవస్థాపక చైర్మన్

న్యూస్‌రీల్

'సమస్యల పరిష్కారానికి పోరాటం'



మాట్లాడుతున్న పర్వత్‌రెడ్డి

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవనంలో ఆదివారం సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెగ్యులర్ డీఈవోను నియమించాలని, సమగ్ర శిక్షా ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్ మెడికల్ బిల్లులు విడుదల చేయాలని, సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఓటుహక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాణిక్‌రావు, తుకారాం, నాయకులు సులేమాన్ జబ్బార్, లక్ష్మణ్, నగేశ్, సంతోష్, అనూష, భాస్కర్, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష



హాల్‌టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: ఆర్థికంగా వెనుబడిన విద్యార్థులకు 8వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఐదేళ్లపాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌లు అందిస్తోంది. ప్రతిభ గల వారిని గుర్తించేందుకు ఏటా 8వ తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రంలో ఆదివారం పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రంలోని బాలురు, బాలికల ఉన్నత పాఠశాలల్లో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. 483 మంది విద్యార్థులకు 431 మంది హాజరు కాగా, 52 మంది గైర్హాజరయ్యారని జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్‌బాబు తెలిపారు. సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పశువులపై పెద్దపులి దాడి

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండలం బండకాస, దాబా గ్రామాలకు చెందిన ఐదు పశువులపై ఆదివారం పెద్దపులి దాడి చేసినట్లు ఆసిఫాబాద్ ఎఫ్‌ఆర్వో గోవింద్‌సింగ్ సర్దార్ తెలిపారు. ఉదయం అటవీ ప్రాంతాలకు పశువులు మేతకు వెళ్లగా పులి దాడి చేసిందన్నారు. గాయపడిన పశువులకు పశువైద్యుడితో చికిత్స అందించామన్నారు. అనంతరం బండకాస గ్రామంలో అటవీ, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. వన్యప్రాణులను రక్షించుకోవడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. వాటికి ఎలాంటి హాని తలపెట్టకుండా అధికారులకు సహకరించాలని కోరారు. పులి దాడిలో పశువులు మృతి చెందితే తక్షణ సాయం కింద రూ.8000 చెల్లిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సవాతి మాజీ సర్పంచ్ దేవ్‌రావు, డీఆర్వో సరోజరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



విజేతలతో అధికారులు, నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని డీటీడీవో రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడాపాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. డీఎస్‌వో మీనారెడ్డి మాట్లాడుతూ జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌కు జిల్లా నుంచి వందమంది క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. 100, 600 మీటర్ల రన్నింగ్‌తోపాటు హైజంప్, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించామన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన 25 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో డిసెంబర్ 1న జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్, ఏసీఎంవో ఉద్ధవ్, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, కోచ్ విద్యాసాగర్, పీడీ, పీఈటీలు హరికృష్ణ, స్వప్న, సౌదర్య, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సర్వే వివరాల నమోదు కీలకం



వీసీలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అధికారులు

ఆసిఫాబాద్: తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కుటుంబ సమగ్ర సర్వేలో సేకరించిన సమాచారాన్ని సక్రమంగా నమోదు చేయడం కీలకమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. జార్ఖండ్ రాజధాని రాంచి నుంచి ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ఆదివారం సమగ్ర సర్వేపై సమీక్షించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సర్వే చివరి దశకు చేరుకుందని, ఎలాంటి పొరపాట్లు లేకుండా డాటా ఎంట్రీ చేయాలని సూచించారు. ఇంటి వద్ద యజమానులు లేకుంటే ఫోన్‌కాల్ ద్వారా వివరాలు సేకరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించేలా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి కలెక్టర్ వెంకటేశ్ దోత్రే వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర సర్వేకు ఎన్యుమరేటర్లు రాని పక్షంలో తెలియజేసేందుకు కంట్రోల్ రూం నం.63046 86505 ఏర్పాటు చేశామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, వార్డు అధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మున్సిపల్ కమిషనర్‌కు తెలిపినా వివరాలు నమోదు చేసేలా చర్యలు చేపడతారని పేర్కొన్నారు.

భీం ఆశయ సాధనకు కృషి



భీం విగ్రహం ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

పెంచికల్‌పేట్(సిర్పూర్): కుమురంభీం ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ఎమ్మెల్సీ దండే విఠల్, భీం మనుమడు సోనేరావు అన్నారు. మండలంలోని పోతపల్లి గ్రామంలో ఆదివారం కుమురంభీం విగ్రహం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆదివాసీలు అణచివేతకు గురవుతున్నారని, హక్కుల సాధనకు ఐక్యమత్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఐదో షెడ్యూల్ రాష్ట్రంలో అమలుకావడం లేదన్నారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య, డీఎంహెచ్‌వో సీతారాం, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి, నాయకులు సిడాం అర్జు మాస్టర్, మడావి శ్రీనివాస్, సోయం చిన్నయ్య, తలండి మధుకర్, సిడాం మల్లేశ్, కుర్సింగ మోతీరాం, శ్రీదేవి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంతో ప్రతిఒక్కరికీ న్యాయం

- సీనియర్ సివిల్ జడ్జి కె.యువరాజ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జడ్జి కె.యువరాజ్

ఆసిఫాబాద్‌అర్బన్: రాజ్యాంగంతోనే దేశంలోని ప్రతిఒక్కరికీ హక్కులు, న్యాయం అందుతాయని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని లుంబినీ బౌద్ధ విహార్ ప్రాంగణంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం, మహోన్నత రాజ్యాంగంపై చర్చ నిర్వహించారు. ముందుగా సమతా భారత్ ఐక్య వేదిక పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగం మహోన్నతమైందన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని కోర్టులో వాదనలు లైవ్‌లో తిలకించే అవకాశం ఉందన్నారు. ఆసిఫాబాద్ ప్రాంతంలో గంజాయి, పోక్సో కేసులు నమోదు కావడం బాధాకరమని పేర్కొన్నారు. యువత పెడదారి పట్టకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ గోపినాథ్, సోషల్ యాక్టివిస్ట్ నిర్మల, సెంట్రల్ కమిటీ అధ్యక్షులు దుర్గం హుక్కు, ఆర్టీసీ డీఎం విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

మూడు గంటలకు లేస్తేనే తాగునీళ్లు



జిల్లాను ఎముకలు కొరికే చలి వణికిస్తోంది. ఇంతటి చలిలోనూ రాత్రి మూడు గంటలకే లేచి తాగునీటి కోసం చేతిపంపు వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి వాంకిడి మండలం ఎనోలి కొలాం గూడ గ్రామంలో నెలకొంది. గ్రామంలోని మిషన్ భగీరథ ట్యాంకు, నల్లాలు నిరుపయోగంగా మారడంతో చేతిపంపుపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఆరు నెలల క్రితం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే గ్రామంలో పర్యటించి మూడు రోజుల్లో సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నెలలు గడిచినా నీటి సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు వాపోతున్నారు. మిషన్ భగీరథ అధికారులకు ఫోన్ చేస్తే రేపుమాపు అంటూ కాలం వెళ్లదీస్తున్నారని చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. - వాంకిడి

డుమ్మాలకు చెక్

- డీఎడ్ కళాశాలల్లో 'ఫేషియల్' అటెండెన్స్
- ఛాత్రోపాధ్యాయులు, లెక్చరర్ల హాజరుపై ఎస్‌సీఈఆర్టీ ఫోకస్
- త్వరలోనే ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాల

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ విద్యను గాడిలో పెట్టడంపై ఎస్‌సీఈఆర్టీ దృష్టి సారించింది. డీఎడ్ విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌ఎస్)ను అమలులోకి తెచ్చింది. ప్రస్తుతం సర్కారు బడుల్లో విద్యార్థులకు ఈ విధానం అమలులో ఉంది. తాజాగా ప్రభుత్వ, ప్రైవేట్ డీఎడ్ కళాశాలల్లో అమలుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రైవేట్ కళాశాలల్లో అభ్యసించే కొంతమంది ఛాత్రోపాధ్యాయులు తరగతులకు ఎగనామం పెడుతున్నారు. వారు నేర్చుకుంటేనే విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేసే అవకాశం ఉంటుంది. అయితే చాలా కళాశాలల్లో తరగతులకు హాజరు కాకుండా యాజమాన్యాలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఇందుకోసం డబ్బులు ముట్టజెబుతున్నారు. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఎస్‌సీఈఆర్టీ ఎఫ్‌ఆర్‌ఎస్‌ను అమలులోకి తెచ్చింది.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఏడు డీఎడ్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ డీఎడ్‌తో పాటు రెండు ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ డైట్‌లో 300 మంది విద్యను అభ్యసిస్తున్నారు. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మీడియంలో కోర్సులు కొనసాగుతున్నాయి. అలాగే వివేకానంద, విద్యార్థి ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. ఇక ఉట్నూర్‌లో పూలాజీబాబా, నిర్మల్‌లో పంచశీల్, భైంసాలో జీపీలడ్డా, ఆసిఫాబాద్‌లో శ్రీనిధి, మంచిర్యాలలో ఎస్‌ఆర్‌కేఎం డీఎడ్ కళాశాలలు కొనసాగుతున్నాయి. వీటిలో ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో కలిపి వంద చొప్పున 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తంగా 900 మంది విద్యార్థులు డీఎడ్ కోర్సు చేస్తున్నారు.

లెక్చరర్లు లేకుండానే..

ఉమ్మడి జిల్లా పరిధిలో చాలా కళాశాలల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకుండానే కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రిన్సిపాల్‌తో పాటు ఎనిమిది మంది లెక్చరర్లను నియమించుకోవాలి. అయితే ఒకరిద్దరితో విద్యాబోధన చేయించి మమ అనిపిస్తున్నారనే విమర్శలున్నాయి. దీంతో విద్యార్థులు స్వతహాగా చదువుకొని పరీక్షలు రాస్తున్నారే తప్పా వారు పూర్తిస్థాయిలో జ్ఞానం పొందలేకపోతున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అయితే ఈ అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఛాత్రోపాధ్యాయులతో పాటు లెక్చరర్లకు ఫేషియల్ అటెండెన్స్ సిస్టమ్ అమలు చేయాలని నిర్ణయించారు.

తరగతులకు ఎగనామం..

ఈ కళాశాలల్లో ఆ జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు చెందిన విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ డైట్‌తో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని జిల్లాల్లో గల ఒకట్రెండు కళాశాలల్లో విద్యార్థులు ప్రతిరోజు వచ్చే విధంగా ఆ యాజమాన్యాలు కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. మిగతా కళాశాలల్లో తరగతులకు గైర్హాజరైతే వారి నుంచి డబ్బులు తీసుకుంటున్నట్లు సమాచారం. హాజరు వేసేందుకు రూ.20వేలు, రికార్డుల కోసం రూ.10వేలు, పరీక్షల సమయంలో మరో రూ.10వేల చొప్పున తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పాఠశాల మాదిరిగానే డీఎడ్ తరగతులు కొనసాగుతాయి. ప్రథమ సంవత్సరంలో 40 రోజులు, ద్వితీయ సంవత్సరంలో 60 రోజుల పాటు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు తరగతులు బోధించాల్సి ఉంటుంది. అలాగే బోధించిన విషయాలపై రికార్డులు రాయాలి. కానీ డబ్బులు ముట్టజెప్పిన వారికి కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నాయి. వార్షిక పరీక్షల సమయంలో సైతం డబ్బులు తీసుకొని పరీక్షలు రాయిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఎఫ్‌ఆర్‌ఎస్ అమలుకు ఏర్పాట్లు



ఎస్‌సీఈఆర్టీ ఆదేశాల మేరకు ప్రభుత్వ డైట్‌తో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని డీఎడ్ కళాశాలల్లో త్వరలో ఫేషియల్ అటెండెన్స్ సిస్టమ్ అమలుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే విద్యార్థులు, లెక్చరర్లు, సిబ్బంది వివరాలను ఎస్‌సీఈఆర్టీకి పంపించాం. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావాలి. లేకుంటే పరీక్షలకు అనుమతించబడదు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. అలాగే ప్రైవేట్ కళాశాలలను తనిఖీ చేస్తున్నాం. – రవీందర్ రెడ్డి, ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్, ఆదిలాబాద్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో బీట్ అధికారికి గాయాలు


గాయపడిన వెంకటేశ్

జన్నారం: విధి నిర్వహణలో సొంత బీట్‌కు వెళ్తున్న బీట్ అధికారి వెంకటేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. అటవీ అధికారులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్‌లో పనిచేస్తున్న వెంకటేశ్ శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై జన్నారం నుంచి చింతగూడ వైపు వెళ్తుండగా చింతగూడ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్ర గాయాలు కావడంతో విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే లక్సెట్టిపేట ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

అనుమానాస్పదంగా యువకుడు మృతి

కడెం: మండలంలోని దత్తోజీపేట్ అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా యువకుడు మృతి చెందినట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అల్లంపల్లికి చెందిన కస్తూరి రమేశ్ (26) ఈనెల 23న కూలీ పని కోసమని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టగా గంగాపూర్ జీపీ పరిధిలోని దత్తోజీపేట్ అటవీ ప్రాంతంలో మృతదేహం కనిపించింది. మృతిపై విచారణ చేపట్టాలని మృతుని భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కల్వర్టు పైనుంచి పడి ఒకరు..


రమేశ్ (ఫైల్)

కడెం: కల్వర్టుపై నిద్ర ఓ యువకుడిని కాటికి పంపింది. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మాసాయిపేట్‌కు చెందిన తీగల రమేశ్(33) కొన్నేళ్లుగా లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పల్లిలో ఉంటున్నాడు. తన మేనత్త మృతి చెందిందని ఇటీవలే మాసాయిపేట్‌కు వచ్చాడు. ఈనెల 23న రాత్రి అతిగా మద్యం సేవించి గ్రామ సమీపంలోని కల్వర్టుపై పడుకున్నాడు. అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య సుకన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రెయినేజీలో పడి ఒకరు..


సుభాష్ (ఫైల్)

ఇంద్రవెల్లి: ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై భీంరావ్ తెలిపిన వివరాల ప్రకా రం దనోరా(బి) గ్రామానికి చెందిన కుంర సుభాష్ (48) ఆదివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకుంటుండగా ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి మృతి చెందాడు. ఏఎస్సై కాత్లే భీంరావ్ మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని బాలుడు..


రిషాన్ (ఫైల్)

దహెగాం: ఐదేళ్లకే ఆ బాలుడికి నూరేళ్లు నిండాయి. ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ట్రాక్టర్ రూపంలో మృత్యువు కబలించింది. మండలంలోని దేవాజీగూడలో ఘటన చోటు చేసుకుంది. ఎస్సై కందూరి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. దేవాజీగూడకు చెందిన సదువుల క్రిష్ణ, వనిత దంపతుల కుమారుడు రిషాన్ (5) ఆదివారం ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన సదువుల శ్రీనివాస్ ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి వరకు ఆడుకుంటున్న బాలున్ని ట్రాక్టర్ కబళించడంతో అయ్యో రిషాన్ అంటూ అక్కడున్నవారు కన్నీటి పర్యంతమయ్యారు. బాలుని బాబాయ్ సదువుల ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

'దిమ్మదుర్తి'లో బర్డ్ ఫెస్టివల్


వడ్రంగి పిట్ట
కొంగ
కొంగజాతి పక్షి


చెరువు అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

- అటవీ ప్రాంతంలో నేచర్ క్యాంపు
- సందడి చేసిన పర్యాటకులు..


అటవీప్రాంతంలోకి సఫారీకి వెళ్తున్న పర్యాటకులు


పక్షుల వివరాలను పర్యాటకులకు వివరిస్తున్న సీసీఎఫ్ అధికారి శరవణన్

మామడ(నిర్మల్): నిర్మల్ జిల్లా మామడ మండలంలోని దిమ్మదుర్తి అటవీ అటవీరేంజ్ పరిధిలో ఉన్న నల్దుర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని తుర్కం చెరువు, పొన్కల్ గ్రామ పంచాయతీ పరిధిలోని యెంగన్న చెరువుల వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేచర్ క్యాంపు, బర్డ్ ఫెస్టివల్ కార్యక్రమాలు హైటీకోస్ బృందం పర్యాటకులను ఆకట్టుకున్నాయి. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులో వచ్చిన పర్యాటకులు శనివారం చెరువుల వద్దకు చేరుకోగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పర్యాటకులు కవ్వాల్ అభయారణ్యం, చెరువులను సందర్శించారు. రాత్రి సమయంలో క్యాంపుఫైర్ ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం తుర్కం చెరువు నుంచి యెంగన్న చెరువుకు ప్రత్యేక వాహనాలలో సఫారీ నిర్వహించారు. చెరువులకు వచ్చిన పక్షుల అందాలను కెమెరాలలో బంధించారు. అటవీశాఖ అధికారులు పీసీసీఎఫ్ వైల్డ్‌లైఫ్ ఏలుసింగ్ మేరు, సీసీఎఫ్ అధికారి శరవణన్, డీఎఫ్‌వో నాగినిభాను, ఎఫ్‌డీవో భవానిశంకర్, ఎఫ్ఆర్‌వోలు శ్రీనివాస్‌రావు, అవినాష్, రామకృష్ణ, అనిత వారికి చెరువుల ప్రాముఖ్యత, ఈ ప్రాంతంలోకి వలస వచ్చే పక్షుల గురించి వివరించారు.

సంతోషం కలిగించింది



అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల నేచర్ క్యాంపు కార్యక్రమం నాకు చాలా సంతోషం కలిగించింది. ఇక్కడ అటవీ ప్రాంతంలో ఉన్న చెరువుల పరిసరాలు, వైవిధ్యమైన పక్షులు ఆహ్లాదం పంచాయి.
– ఉషా, పర్యాటకురాలు, హైదరాబాద్

పరిసరాలు ఆకట్టుకున్నాయి



నేచర్‌క్యాంపు, బర్డ్ వాక్ కార్యక్రమంలో భాగంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వరంగల్ నుండి వచ్చా. ఇక్కడి చెరువుల పరిసరాలు ఆకట్టుకున్నాయి. పక్షులు నివసించేందుకు అనువైన వాతావరణం ఉంది. పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తే బాగుంటుంది.– రమేశ్, వైల్డ్‌లైఫ్ ఎన్‌జీవో సొసైటీ, వరంగల్

అవగాహన కల్పించారు



రెండు రోజుల నేచర్ క్యాంపు కార్యక్రమం చాలా ఆనందం కలిగించింది. చెరువు పరిసరాలు, పక్షులు, చెట్లరకాలపై అటవీశాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఇక్కడి ప్రాంతం ప్రాముఖ్యతను ఇతరులకు కూడా తెలియజేస్తాం. పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతుంది.
– గుర్రం కిషోర్, పర్యాటకుడు, వరంగల్

పక్షులు పర్యావరణ మిత్రులు


మాట్లాడుతున్న ఎఫ్ఆర్వో శివకుమార్

చెన్నూర్: పక్షులు పర్యావరణ మిత్రులని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శివకుమార్ అన్నారు. రెండు రోజు లుగా మంచిర్యాల రేంజ్ పరిధిలోని శివ్వారం వైల్డ్‌లైఫ్ సాంక్చురీ, గొల్లవాగు ప్రాజెక్ట్, చెన్నూ ర్ రెంజ్ పరిధిలోని అర్బన్ ఎకో పార్క్‌లో డబ్ల్యూడబ్ల్యూఎఫ్ బృందం సభ్యులతో కలిసి పక్షులు, కీటకాలు, జీవరాసులపై సర్వే చేశారు. స్థానిక ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఆదివా రం డబ్ల్యూడబ్ల్యూఎఫ్ బృందం ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. గోదావరి పరీవాహక ప్రాంతమైన మంచిర్యాల, చెన్నూర్, కోటపల్లి, నీ ల్వాయి రేంజ్ ఆఫీసర్లు, సిబ్బందితో కలిసి పక్షులు, కీటకాలు, జీవరాసులపై అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడించారు. రెండు రోజుల సర్వేలో 150 రకాల పక్షులు, 30 రకాల సీతాకోక చిలుకలను గుర్తించామన్నారు. శీతాకాలంలో నది పరీవాహక ప్రాంతాలకు వివిధ రకాల పక్షులు, బట్టర్‌ఫ్లైలు వలస వస్తుంటాయని, వీటిని సంరక్షించుకోవాలన్నారు. అటవీ ప్రాంతాల్లో పులులు, అడవి జంతువులే కాకుండా ఎ న్నో రకాల బర్డ్స్, బట్టర్‌ఫ్లైలు ఉంటాయన్నా రు. అనంతరం డబ్ల్యూడబ్ల్యూఎఫ్ ప్రతినిధి రాజశేఖర్ మాట్లాడుతూ ఉత్తర భారత దేశంలో పక్షులు గోదావరి తీర ప్రాంతాలలో 8 వేల కోట్ల విలువైన ఎరువులను విసర్జిస్తుందన్నారు. చెరువులు, కుంటలకు కొత్త రకం బాతులు, కొంగలు వలస వస్తుంటాయని, వాటి ద్వారా ఎన్నో లాభాలు ఉన్నాయని తెలిపారు. పక్షులు, కీటకాలు వలస వస్తే ఈ ప్రాంతాల్లో వాటి సంతతి పెరుగుతుందన్నారు. మానవళి బర్డ్స్, బట్టర్‌ఫ్లైలకు హాని తలపెట్టవద్దని సూచించారు. సమావేశంలో నీల్వాయి, కోటపల్లి, మంచిర్యా ల రేంజ్ ఆఫీసర్లు అప్పలకొండ, సదానందం, రత్నాకర్, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ రిసోర్స్ పర్సన్లు హర్ష, సోహన్, డీఎఫ్‌వో ప్రభాకర్ పాల్గొన్నారు.

యువకుడి చికిత్సకు చేయూత

సాక్షి ఎఫెక్ట్..


కిరణ్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న రమేశ్

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన అమంద కిరణ్ కొంతకాలంగా కడుపు ఉబ్బరం, లివర్ సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ విషయమై ఈ నెల 18న 'సాక్షి'లో 'దాతల సాయంకోసం ఎదురు చూపు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన దాతలు కరిపె రాజ్‌కుమార్, పాల మహేశ్, ఇరాక్ రాజు, గంగాధర్, వినోద్, సైబెవార్ ఆంజనేయులు, చంద్రవిలాస్, కాలేరి రమేశ్, సత్యనారాయణ రూ.15వేల వరకు ఫోన్‌పే ద్వారా సాయం అందించారు. ఆదివారం కాంగ్రెస్ నాయకుడు వేల్పుల రమేశ్ తన సొంత ఖర్చుతో వాహనాన్ని ఏర్పాటు చేసి ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించాడు. కాగా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సకు సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యాధికారులు పేర్కొన్నారు. దాతలు స్పందించి ఆదుకుంటే తప్ప కిరణ్ బతికే అవకాశం లేదని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

కొరమీనుకు కేరాఫ్‌గా మంచిర్యాల

- ఎల్లంపల్లి పాజెక్టు వద్ద సంరక్షణ, పెంపకం కేంద్రం
- 30 ఎకరాల్లో రూ. 15 కోట్లతో ఏర్పాటు
- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు


ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద కొరమీను సంరక్షణ కేంద్రం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పీఎస్సార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రాష్ట్ర చేప కొరమీను(కొర్రమట్ట, బొమ్మె)కు మంచిర్యాల జిల్లా కేరాఫ్‌గా మారుతుందని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని ఎల్లంపల్లి వద్ద కొరమీను సంరక్షణ, పెంపకం కేంద్రం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఈమేరకు ప్రతిపాదిత స్థలాన్ని రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టుకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి స్థల పరిశీలన చేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ భారీ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. 30 ఎకరాల్లో రూ.15 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కొరమీను జాతిని కాపాడటంతోపాటు సంఖ్యను గణనీయంగా పెంచుతూ రాష్ట్ర అవసరాలను తీర్చి ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు ఎగుమతి చేసేలా ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇక్కడ ఉత్పత్తయ్యే చేప పిల్లలను రాష్ట్ర వ్యాప్తంగా చేపల పంపిణీ పథకానికి ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. చేపల పెంపకం కోసం ఫిష్‌పాండ్‌లు ఏర్పాటు చేసుకుని ఉపాధితోపాటు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఎల్లంపల్లి వద్ద 85 ఎకరాల స్థలాన్ని మత్స్య శాఖకు అప్పగించగా, అందులో 30 ఎకరారు కొరమీను పెంపకం, సంరక్షణ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మిగతా 55 ఎకరాల్లో అక్వా కల్చర్‌ఫాం కూడా ఏర్పాటు చేసి అన్ని రకాల చేపల పెంపకం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ ఏడీ వై.సాంబశివరావు, హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, సర్వేయర్ ఆశిష్, ఆర్ఐ ప్రభు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట రవి, జిల్లా అధికార ప్రతినిధి చిట్ల సత్యనారాయణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్ని పోటీల్లో పాల్గొనేలా చూస్తాం

- ట్రిపుల్‌ఐటీ వీసీ గోవర్ధన్


ప్రశంసాపత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో చదివే విద్యార్థులను దేశవ్యాప్తంగా నిర్వహించే అన్ని పోటీలకు పంపిస్తామని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ పేర్కొన్నారు. ఆటోవన్– 24 పోటీల్లో రాణించిన విద్యార్థులను ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనేలా చూస్తామని, అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తామని చెప్పారు.

రెండోస్థానంలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

హైదరాబాద్ బిట్స్‌పిలానిలో ఈనెల 22, 23 తేదీల్లో ఆటోవన్ 24 పోటీలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు రెండోస్థానంలో నిలిచారు. మెకానికల్, మెటలార్జికల్ ఇంజినీరింగ్ చదివే విద్యార్థులు పాల్గొని 'మెటీరియల్స్ టెక్నాలజీ ఫర్ ఎలక్ట్రిక్ వెహికల్స్' అనే పోస్టర్ ప్రదర్శించారు. విద్యార్థుల కృషిని గుర్తించిన అక్కడి న్యాయ నిర్ణేతలు రెండోస్థానం కేటాయించారు. రూ.8వేల నగదు బహుమతి ఇచ్చి ప్రోత్సహించారు.

'ఆటవెలదిలో అమెరికా' పుస్తక పరిచయం


పుస్తక పరిచయం చేస్తున్న వామన్‌రావు

మంచిర్యాలఅర్బన్: జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక కృష్ణవేణి పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సాహితీ సంరక్షణ సమితి అలరించింది. కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌కు చెందిన సబ్బని లక్ష్మీనారాయణ రచించిన ఆటవెలదిలో అమెరికా అనే పుస్తకాన్ని సంస్థ అధ్యక్షుడు వామన్‌రావు పరిచయం చేశారు. 2018లో తన అమెరికా అనుభవాలను పద్య కావ్యం ఆటవెలదిలో అమెరికా శతకాన్ని తన ప్రయాణ అనుభవాలను అమెరికా విశేషాలను, తెలుగువారి అప్యాయత, అదరించిన తీరు వర్ణించారన్నారు. నగలు నట్రలేవు వారి హృదయమున అంటూ వారి మనసులను ఉదహరించారని తెలిపారు. వృత్తి ఆంగ్లోపన్యాసకుడిగా, ప్రవృత్తి సాహిత్య సేద్యం చేస్తూ లక్ష్మీనారాయణ కలం నుంచి 41 పుస్తకాలు ఆవిష్కరించారన్నా రు. సాహిత్య వేదికలను స్థాపించటం, ఏడు ఆడియో గీతాల క్యాసెట్ల ఆవిష్కరణ, ఎన్నో అవార్డులు దక్కించుకున్నారని కొనియాడారు. సంస్థ ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, మహిళా కార్యదర్శి అడ్డగూరి శ్రీలక్ష్మీ, సంతోష్ కవితాగానం చేశారు.

గుప్తనిధుల ముఠా అరెస్టు


పెంచికల్‌పేట్: పోలీసుల అదుపులో ముఠా సభ్యులు

పెంచికల్‌పేట్: మండలంలోని లోడ్‌పల్లి బీట్ పరిధిలో సిద్ధేశ్వర గుట్టల్లో గుప్తనిధుల తవ్వకానికి వచ్చిన ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పెంచికల్‌పేట ఎఫ్ఆర్‌వో అనిల్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేయగా రెండు కార్లలో వచ్చిన ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రేంజ్ కార్యాలయానికి తరలించారు. బొంబాయిగూడకు చెందిన వసంతరావు, కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రవీణ్‌కుమార్, వెంకన్న, సురేందర్, వెంకన్న, అంజన్న, రమేశ్‌పై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రెండు కార్లను సీజ్ చేశారు. ఈ దాడుల్లో డీఆర్‌వో జమీల్ అహ్మద్, ఎఫ్ఎస్‌వో వేణుగోపాల్, ఎఫ్‌బీవో మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల తవ్వకాల కలకలం

చెన్నూర్‌రూరల్: చెన్నూర్ మండలంలోని కన్నెపల్లిలో గుప్త నిధుల తవ్వకాలు ఘటన కలకలం రేపింది. కన్నెపల్లిలో పాడు బడిన ఇంటిలో ఆదివారం గుప్త నిధుల కోసం ఇంటి యజమానితో పాటు పలువురు తవ్వకాలు జరిపారు. సమాచారం అందుకున్న పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. వారి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, ఒక ఆటో, పూజా సామగ్రి స్వాధీనం చేసుకున్నట్లు చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. కొద్దిరోజులుగా ఈ ఇంట్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

బాసరలో సామూహిక సత్యనారాయణ వ్రతం


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న దంపతులు

బాసర: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆదివారం కార్తిక మాసాన్ని పురస్కరించుకుని సామూహిక శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. వ్యాసపురి కన్యకా పరమేశ్వరి చారిటబుల్ ట్రస్ట్, యాత్రిక్ నివాస్ ట్రస్ట్ చైర్మన్ మూడ నాగభూషణం గుప్తా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

ఎంపీ పూజలు


పూజల్లో పాల్గొన్న ఎంపీ వంశీకృష్ణ

దండేపల్లి(మంచిర్యాల): జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామిని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీనివాస్, సిబ్బంది, అర్చకులు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అధికారులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం, లడ్డూప్రసాదం అందజేశారు.

సబ్‌స్టేషన్ గోదాంలో షార్ట్‌సర్క్యూట్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో గల జేపీఈ గోడౌన్‌లో ఆదివారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు ఆర్పివేశారు. పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ గోడౌన్ ఉండగా పెను ప్రమాదం తప్పింది. దాదాపు రూ.25 వేల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

తాండూర్: మండల కేంద్రంలోని సురభి గోదా క్షేత్ర గార్డెన్స్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం అట్టహాసంగా జరిగింది. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997–98 విద్యాసంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు 27 ఏళ్ల తర్వాత కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. నాడు విద్య నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో నాటి గురువులు ఎస్.రాంమ్మోహన్‌రావు, ఎం.రాంమ్మోహన్‌రావు, జగన్నాథరావు, సురేందర్, రవి, సుభాంగిణి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

గూడెంలో భక్తుల రద్దీ


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని గూడెం శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో కార్తికమాసం ప్రారంభం నుంచి భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సుమారు 584 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతా లు నోముకున్నారు. సన్నిధి ద్వారం సమీపంలో గల రావిచెట్టు వద్ద భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా కనిపించాయి.